508) శంకరాభరణం

ప॥ ఇతనిప్రసాదమే యిన్నియును। గతి యితనిదేకన కాదనరాదు॥

చ॥ కాయములో నొకఘనసంసారము। ప్రాయంబులతో బ్రబలీని।
ఆయ మందుకును హరి దానెయై। దాయక పాయక తగిలున్నాడు॥

చ॥ వొనరినకలలో నొకసంసారము। మనసుతోడనే మలసీని।
ననిచి యందుకును నారాయణుడై। కొనమొదలై తా గురియైనాడు॥

చ॥ వుడిబడి కోర్కుల నొకసంసారము। బడిబడియాసల బరగీని।
విడువక యిది శ్రీవేంకటేశ్వరుడే। తొడిబడ గల్పించి ధ్రువమయినాడు॥